క్లుప్తంగా

డీఎస్సీ ప్రకటనపై హర్షం

కాశీబుగ్గ: డీఎస్సీ నిర్వహణ ఫైల్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేయడం హర్షనీయమని బీజేపీ జిల్లా లీగల్ సెల్ కోకన్వీనర్ కొర్రాయి బాలక్రిష్ణయాదవ్ అన్నారు. పలాసలో గురువారం విలేకరులతో మాట్లాడారు. అలాగే వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళల పింఛన్ మొత్తాన్ని పెంచడం సంతోషకరమన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



గుళ్లలపాడులో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: పారిశుద్ధ్య వారోత్సవాలు సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులను అధికారులు చేపడుతున్నారు. గుళ్లలపాడు, చినవంక, తాడివాట, డోకులపాడు తదితర గ్రామాల్లో సర్పంచ్‌లు, పలు పార్టీల నాయకుల సమక్షంలో గురువారం పారిశుద్ధ్య పనులు జరిగాయి. ఇన్‌చార్జి ఎంపీడీవో డిక్కల తిరుమలరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ హేమబాబు చౌదరి పనులను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అసభ్యకరంగా..

టెక్కలి: మహిళలు తల దించుకునేలా యువతులు చేసిన నగ్న డ్యాన్సుల ప్రదర్శనలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. సంతబొమ్మాళి మండలం కె.లింగూడు, గంటపేట గ్రామాల్లో ఇటీవల జరిగిన ఈ అశ్లీల నృత్యాల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి.

ఆర్థికాభివృద్ధిపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు

ఇచ్ఛాపురం రూరల్: ఆర్థికాభివృద్ధిపై మహిళలు దృష్టి సారించాలని సెర్ప్ ఏపీఎం సనపల ప్రసాదరావు అన్నారు. స్థానిక మండల సమాఖ్య భవనంలో వీఓఏలతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. స్వయంశక్తి సంఘాల సభ్యులకు ఇవ్వనున్న వివిధ రకాల రుణాలను సద్వినియోం చేసుకునేలా చూడాలన్నారు. సభ్యులందరికీ తెలిసేవిధంగా రుణాల చెల్లింపు వాయిదాలు, రికార్డుల నిర్వాహణపై అవగాహన కల్పించారు.

స్టూడెంట్‌కిట్లు అందజేత



స్టూడెంట్ కిట్లను అందజేస్తున్న హేమబాబు చౌదిరి

వజ్రపుకొత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్టూడెంట్ కిట్లను చినవంక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ హేమబాబు చౌదిరి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నారులకు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధర్మారావు, గ్రామ పెద్దలు, నాయకులు మదనాల సింహాచలం, ఇరోతు రాంభీ, నాగేష్, కె.ప్రసాద్ ఉన్నారు.

మంచినీరు వృథా!



ఓవర్ హెడ్ ట్యాంకు నిండి వృథాగా పోతున్న నీరు

కంచిలి: మండలంలోని బూరగాం గ్రామంలో మంచినీటిని వృథా చేస్తున్నారు. కొన్నిచోట్ల నీరు లేక ప్రజలు అవస్థలు పడుతుంటే..బూరగాంలో మాత్రం నీటి వనరులపై అశ్రద్ధ కనబరుస్తున్నారు. ఇక్కడ రక్షిత మంచినీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంక్‌ని నింపడానికి వేసిన మోటారును, ఆ ట్యాంకు నిండిపోయినప్పటికీ కొన్ని గంటల తరువాత కూడా ఆఫ్ చేయలేదు. దీంతో నీరంతా వృథాగా బయటకు పోతోంది. ఇది బూరగాం గ్రామంలో గురువారం కనిపించిన దృశ్యం. ఇక్కడ ఎప్పటికప్పుడు ఇదే పరిస్థితి నెలకొంటోందని స్థానికులు చెబుతున్నారు. ఇకముందు ఇలా నీటి వృథా జరగకుండా అధికార యంత్రాంగం అవసరమైన పటిష్ట చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అక్షరాభ్యాసం



నందిగాం మండలంలోని పెద్దతామరాపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు గున్నయ్య ఆధ్వర్యంలో 16 మంది విద్యార్థులకు అక్షరాభ్యాసం చేసి ఒకటో తరగతిలో చేర్పించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు బాలక శంకరరావు, వనిత, కుమారి ఉన్నారు. - నందిగాం

యోగా వేడుక

పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని ముందస్తుగా గురువారం ఇచ్ఛాపురంలో నిర్వహించారు. రత్తకన్నలోని శ్రీవినాయక విద్యానికేతన్ పాఠశాలలో పతంజలి యోగా సమితి అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. యోగా ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ కోకిల, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. - ఇచ్ఛాపురం



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు



సంతబొమ్మాళి మండలం మరువాడ పంచాయతీ పరిధి దిబ్బలమరువాడ, చిన్న మరువాడ, చొక్కారవానిపేట, రెడ్డిక మరువాడ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. సర్పంచ్ సురాడ ధనలక్ష్మి పుస్తకాలను అందజేశారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకుడు సూరాడ దాసురాజు, సూరాడ భీమారావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. -సంతబొమ్మాళి

విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

కాశీబుగ్గ:

ప్రభుత్వం అందజేస్తున్న విత్తనాలు, ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు, నాయకులు అన్నారు. మందస, పలాస మండలాల పరిధిలోని పలు సచివాలయాలలో విత్తనాలు, ఎరువులను గురువారం పంపిణీ చేశారు. ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేస్తున్న ఎంటీయూ-1061, ఎంటీయూ-1064, బీపీటీ-5204, ఎంటీయూ-7029, ఆర్‌జీఎల్-2537 రకాల విత్తనాలను ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు అందించారు. మండల కేంద్రమైన మందస మేజర్ పంచాయతీ సచివాలయం వద్ద ముఖ్యనాయకులు డొంకూరు తిరుపతిరావు, రాజన మహేష్‌ల ఆధ్వర్యంలో విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. అలాగే పలాస మండలం చినంచల గ్రామంలో పినకాన తిరుమల, పైల విష్ణుమూర్తి, అరియాపల్లి ప్రభుదాస్, కాశీ మార్కేండేయులు, కంచరాన మధుల విత్తనాలు, ఎరువులను అందించారు. పలాస మండలం లక్ష్మీపురం సచివాలయం వద్ద కూడా విత్తనాల పంపిణీని అధికారులు చేపట్టారు. కార్యక్రమంలో దువ్వాడ సంతోష్‌కుమార్ నాయుడు, బూర్లి కృష్ణంరాజు, దువ్వాడ శ్రీహర్ష, బూర్లి డిల్లీశ్వరరావు ఉన్నారు.

సంతబొమ్మాళి: మండల కేంద్రం సంతబొమ్మాళి రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు సబ్సిడీపై విత్తనాలను ప్రజాప్రతినిధులు, అధికారులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కూచెట్టి కాంతారావు,అల్లు రమేష్, చల్ల జగ్గారావు ఉన్నారు.

కవిటి: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరిసాగుకు సమాయత్తమయ్యే అన్నదాతకు సకాలంలో విత్తనాలు అందించడం శుభపరిణామమని సర్పంచ్ మురపాల లచ్చయ్య అన్నారు. ఆర్.కరాపాడు పంచాయతీలో స్థానిక టీడీపీ నాయకుడు వాసుదేవ్‌తో కలిసి రైతులకు అవసరమైన వరివిత్తనాల్ని పంపిణీ చేశారు. ప్రస్తుతం 1061, 1064, సాంబమసూరి, శ్రీకాకుళం సన్నాలు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ సహాయక సిబ్బంది అమూల్య తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అబ్దుల్‌హక్ ఉన్నారు.



కాశీబుగ్గ: చినంచలలో విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



కవిటి: ఆర్.కరాపాడులో విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకులు



కాశీబుగ్గ: లక్ష్మీపురంలో విత్తనాలు అందిస్తున్న నాయకులు, అధికారులు



సంతబొమ్మాళి: రైతులకు విత్తనాలను అందజేస్తున్న నాయకులు



కాశీబుగ్గ: మందస సచివాలయం వద్ద విత్తనాల పంపిణీ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- సివిల్ కోర్టు జడ్జి బి.ఎం.ఆర్ ప్రసన్నలత

సంతబొమ్మాళి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని కోటబొమ్మాళి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. బోరుభద్ర గ్రామంలో న్యాయవిజ్ఞాన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ.. వాతావరణ కాలుష్యం జరగకుండా ప్రతిఒక్కరు తమవంతుగా పాటు పడాలని కోరారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉండవచ్చునని అన్నారు. మండల న్యాయ సంఘం ద్వారా ఉచితంగా న్యాయ సలహాలు అందిస్తారని అన్నారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు ఎల్.సంధ్యారాణి, పి.స్వాతి, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎల్.శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి, స్థానిక సర్పంచ్ బి.లక్ష్మీకాంతం, చింతాడ చిన్నారావు ఉన్నారు.



రోగులకు మందులను అందజేస్తున్న సివిల్ జడ్జి ప్రసన్నలత

విద్యార్థులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ గండం!

కాశీబుగ్గ: ప్రభుత్వ రెసిడెన్షియల్ వసతి గృహాలలో ప్రవేశానికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటిలానే సాధారణ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కాకుండా.. సికిల్‌సెల్ ఎనీమియా, తలసేమియా, హెమోలైటిక్ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేసుకుని అవి లేవనే నిర్ధారించుకుని సంబంధిత ధ్రువపత్రం తీసుకుని రావాలని కొత్త నిబంధన ఉండటంతో విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. మందస పరిసర ప్రాంతాలలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నడుస్తున్న కొన్ని వసతి గృహాలలో సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడి కొంతమంది చనిపోయారు. వసతిగృహాల్లో ఉండడం వల్లే చనిపోయారని తప్పుడు ప్రచారాలు జరగడంతో ఈసారి ప్రభుత్వం నిబంధనలు పటిష్టం చేసింది. అయితే ప్రాథమిక ఆస్పత్రిలో ఈ పరీక్షలకు అవకాశం లేక పోవడంతో విద్యార్థులు పాట్లు పడుతున్నారు. గురువారం పదుల సంఖ్యలో మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి విద్యార్థులు వచ్చారు. అయితే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు వైద్యాధికారి డాక్టర్ మద్దిల సంపతిరావు నిరాకరించారు. తాము ఇవ్వడానికి ఆదేశాలను రాలేదని స్పష్టం చేశారు. టెక్కలి జిల్లా ఆస్పత్రి, శ్రీకాకుళం రిమ్స్‌లో మాత్రమే అవకాశం ఉందని తెలపడంతో విద్యార్థులు వెనుదిరిగారు. అధికారుల స్పందించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇప్పించి ఇబ్బందులు లేకుండా చూడాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



నిరాశతో మందస పీహెచ్‌సీ నుంచి వెనుదిరుగుతున్న విద్యార్థినులు, తల్లిదండ్రులు

నేడు మున్సిపాలిటీలో యోగా దివాస్

కాశీబుగ్గ: కాశీబుగ్గలో శారదనగర్‌లోని శ్రీవివేకానంద రామక్రిష్ణ సేవా సంఘం ఆవరణలో 'ప్రపంచ యోగా దివాస్'ను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ ప్రధాన కార్యదర్శి ఇచ్ఛాపురం కృష్ణారావు గురువారం తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో యోగా దినోత్సవం గురించి నిపుణులైన యోగా గురువులు వివరిస్తారు.

పెరిగిన జీతాలు అందజేయాలి

టెక్కలి: ఆర్టీసీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు పెరిగిన జీతాలను అందజేయాలని కోరుతూ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆయా కార్మికులు గురువారం స్థానిక డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు మురళి ఆధ్వర్యంలో ప్రతినిధులు టి.ముత్యాలరావు, పి.మధుసూధనరావు, డి.కిరణ్, డి.కృష్ణారావు, ఆర్.నవీన్‌కుమార్, అనిల్ ఉన్నారు.

ఒడియా విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు

కాశీబుగ్గ: పలాస మండలంలో ఒడియా కాంప్లెక్స్ పరిధిలోని గ్రామాలలో ఒడియా ఉపాధ్యాయులు గురువారం పర్యటించారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు అర్హత ఉన్న ఒడియా మీడియం విద్యార్థులను గుర్తించి వారికి తల్లిదండ్రుల సమక్షంలో వారి ఇంటివద్దనే స్పాట్ అడ్మిషన్‌లు కల్పించారు. మండలంలోని రెంటికోట, పలాస, తర్లాకోట, మరదరాజపురం, సున్నాడ, కాశీబుగ్గ, బ్రాహ్మణతర్లా పాఠశాలలో ఒడియా పాఠశాలలు అందుబాటులో ఉన్నాయని ఉపాధ్యాయ తెలిపారు. స్పాట్ అడ్మిషన్ కార్యక్రమంలో ప్రభుత్వ ఒడియా ఉపాధ్యాయులు చక్రపాని ప్రదాన్, నాగేశ్వరరావు, కోదండ మహంతి, విజయ పానిగ్రహి, సోమేశ్వరరావు, నాగేశ్వర పాత్రో, మిశ్రో, గోవిందరాజు, సీఆర్‌ఎంటీ ఉర్నాన అప్పలరాజు ఉన్నారు.



మరదరాజపురంలో స్పాట్ అడ్మిషన్ చేస్తున్న ఒడియా విద్యార్థులతో ఉపాధ్యాయులు

పాఠశాల అవరణలోకి కుక్కలు!

టెక్కలి రూరల్: స్థానిక జిల్లాపరిషత్ పాఠశాల అవరణలోకి ఊరకుక్కలు చొరబడుతున్నాయి. దీంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. గురువారం మధ్యాహ్నం పిల్లలు భోజనాలు చేసే సమయంలో కుక్కలు చొరబడ్డాయి. పిల్లలపై దాడి చేస్తే బాధ్యులు ఎవరిని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. కుక్కలు చొరబడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



విద్యార్థులు భోజనాలు చేస్తున్న ప్రదేశంలో కుక్కలు

పకడ్బందీగా 'బడికి పోదాం'



కంచిలి: మాట్లాడుతున్న ఎంపీడీవో నీరజ



కంచిలి: మ్యాజిక్ షోను వీక్షిస్తున్న విద్యార్థులు

కంచిలి: రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు 'బడికి పోదాం' కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో వి.నీరజ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల స్థాయిలో సీఆర్‌టీఎంలు, విద్యాసంక్షేమ సహాయకులతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. బడికి పోదాం కార్యక్రమం ద్వారా బడిఈడు పిల్లల్ని గుర్తించి పెద్దఎత్తున బడిలో చేర్పించాలని అన్నారు. ఆరు నుంచి 14 ఏళ్ల పిల్లల్ని సమీపంలో గల బడిలో చేర్పించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని, స్థానిక విద్యార్థులతో గ్రామాల్లో ర్యాలీలను నిర్వహించాలన్నారు. బడిఈడు గల ఏ ఒక్క విద్యార్థి బడిబయట ఉండటానికి వీల్లేదన్నార. సమావేశంలో తహసీల్దార్ ఎం.వి.కె.ఎస్.రవి, ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు ఉన్నారు.

అలరించిన మ్యాజిక్ షో

కంచిలి: మండలంలోని ఎక్కల గ్రామ ప్రాథమిక పాఠశాలలో గురువారం మ్యాజిక్ షో జరిగింది. విద్యార్థులు ఆసక్తిగా దీన్ని తిలకించారు. 'బడికి పోదాం' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ఉత్తేజ పరచడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మ్యాజిక్ షోలో విద్యాపరమైన అంశాలను వివరించి, విద్యార్థులను ఆలోచింపజేశారు. కాగా గురువారం 12 మంది పిల్లలు కొత్తగా పాఠశాలలో చేరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమారావు, కామేష్‌రెడ్డి, జీవిత బెహరా, రూప పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

కాశీబుగ్గ: ప్రజలకు రెవెన్యూ సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని వక్తలు అన్నారు. పలాసలోని ఆర్డీవో కార్యాలయం వద్ద గురువారం రెవెన్యూ డే వేడులను జరుపుకున్నారు. పలాస రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల తహసీల్దారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. పలాస ఆర్డీవో భరత్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులను సత్కరించారు.

సోంపేట: స్థానిక స్థానిక కార్యాలయంలో రెవెన్యూ డే వేడుకలు తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉద్యోగులకు తహసీల్దార్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ నిస్వార్థంగా సేవలు అందించడం ఆనందించదగ్గ విషయమన్నారు. ఆర్ఐ రవి, సిబ్బంది పాల్గొన్నారు.



సోంపేట: మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్



కాశీబుగ్గ: మాట్లాడుతున్న ఆర్డీవో భరత్ నాయక్

23న జిల్లా అండర్-19 చెస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లాస్థాయి అండర్-19 బాలబాలికల చెస్ ఎంపిక పోటీలు ఈనెల 23వ తేదీన జరగనున్నాయని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బగాది కిషోర్, జామి రమేష్ గురువారం తెలిపారు. శ్రీకాకుళం నానుబాలవీధిలో ఉన్న చెస్ శిక్షణ కేంద్రంలో ఆ రోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి ఎంపిక పోటీలు జరుగుతాయని చెప్పారు. పాల్గొనే బాలబాలికలు 2005 జనవరి ఒకటో తేదీ తర్వాత జన్మించి ఉండాలని సూచించారు. ఇక్కడ ఎంపికై న బాలబాలికలను వచ్చేనెల (తేదీలు ఖారుకాలేదు)లో నంద్యాల వేదికగా జరగనున్న ఏపీరాష్ట్రస్థాయి అండర్-19 చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు ఎంట్రీఫీజుగా రూ.300 చెల్లించాల్సి ఉంటుందన్నారు. 22వ తేదీ సాయంత్రం ఆరు గంటల్లోగా తమ పేర్లను అభినవ్ (సెల్:7416864642)కు కాల్‌చేసి నమోదు చేసుకోవాలని సూచించారు.

29న లోక్‌అదాలత్

కాశీబుగ్గ: పలాస కోర్టు సముదాయంలో ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి యూ.మాధురి కోరారు. లోక్‌అదాలత్ విషయమై చర్చించేందుకు కోర్టు పరిధిలోని న్యాయవాదులు, పోలీసు సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. అమె మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలని సూచించారు. బార్ అసోసి యేషన్ సభ్యులు కోత రజనికుమార్, జీఎస్‌ఎస్ అనీల్‌రాజు, పిండి వెంకటరావు, వి.రవి, వై.హేమకుమార్, దేవరాజు, జి.ప్రభాకర్, విశ్వేశ్వరరావు, కాశీబుగ్గ రూరల్ సీఐ ఈశ్వరరావు, ఎస్సైలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి మాధురి

ముగిసిన పర్యావరణ వారోత్సవాలు

ఇచ్ఛాపురం: మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహిస్తున్న పర్యావరణ వారోత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. ఈ నెల 13వ తేదీ నుంచి మిషన్‌లైఫ్ పర్యావరణ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కల ఆవశ్యకత, సుస్థిర ఆహార వ్యవస్థ, శక్తివనరుల సద్వినియోగం, ఆరోగ్యకరమైన జీవనవిధానం, నీటి వృథాను అరికట్టడం వంటి విషయాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం పద్మవల్లి, గ్రీన్‌కార్ప్స్ కోఆర్డినేటర్ గగనకుమారి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెచ్‌ఎం పద్మవల్లి

ఘనంగా ఎల్లమ్మ సంబరం

కవిటి: పుటియాదళ రెవెన్యూ గ్రామంలో వెలసిన పాడిపంటలకు ఆదిదేవతగా భావించే ఎల్లమ్మ అమ్మవారి సంబరం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అన్నివర్గాల ఆర్థికసాయంతో ప్రగడపుట్టుగ వెంకటేశ్వర యువజన సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి సంబరాన్ని జరుపుకున్నారు. వర్షాలు సకాలంలో కురవాలని, పాడిపంటలతో ప్రజలు సుఖసంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని కాంక్షిస్తూ ఏటా ఈ సీజన్‌లో ఎల్లమ్మ అమ్మవారి ఉత్సవం నిర్వహించడం సంప్రదాయం. కవిటి, గొండ్యాలపుట్టుగ, రామయ్యపుట్టుగ, ప్రగడపుట్టుగ గ్రామాలకు చెందిన భక్తులు సంబరాల్లో పాల్గొన్నారు.



అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు